ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.!

● నిలిచిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్-వెజ్ మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు ● మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించి ఇప్పటికీ పూర్తి చేయని వైనం
● పనులు పూర్తి చేయాలని నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రజల డిమాండ్ ● ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో.?


నాగారం మున్సిపాలిటీలో ఏడాదిన్నరగా నిలిచిపోయిన మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు


దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో ముందుకు సాగని మార్కెట్ నిర్మాణ పనులు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా రహదారుల వెంట కొనసాగుతున్న మార్కెట్ (వారాంతపు సంత)లతో ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు గత ప్రభుత్వం రెండు మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్-వెజ్ మార్కెట్‌యార్డుల నిర్మాణాలను చేపట్టింది. ఇందు కోసం నాగారంలో 2 ఎకరాలు, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలో సుమారు 3 ఎకరాల ప్రభుత్వం స్థలాలను మార్కెట్ యార్డుల నిర్మాణాలకు కేటాయించింది. నాగారంలో సుమారు 4.5 కోట్ల నిధులతో 48 దుకాణ సముదాయాలు, అహ్మద్‌గూడలో రూ.7.2 కోట్ల నిధులతో 148 దుకాణ సముదాయాలు నిర్మించే విధంగా ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్-వెజ్ మార్కెట్‌యార్డు పనులను 2022లో అప్పటి మంత్రిగా ఉన్న చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.

ఓ చోట శ్లాబ్ వరకు.. మరో చోట పిల్లర్ల వరకు..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాగారం మున్సిపాలిటీలో శిల్పావెంచర్ సమీపంలో అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు సుమారు 1.6 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. అదే విధంగా అహ్మద్‌గూడలో సుమారు రూ.4కోట్ల మేరకు పనులు పూర్తి చేశారు. రెండు మున్సిపాలిటీలో వెజ్ మార్కెట్‌యార్డుల పనులను శ్లాబ్‌ల వరకు పూర్తి చేశారు. నాన్-వెజ్ మార్కెట్‌ల నిర్మాణ పనులు మాత్రం పిల్లర్లకే పరిమితమయ్యాయి.

ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు

అసెంబ్లీ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో మున్సిపాలిటీల్లో చేపట్టిన వెజ్, నాన్-వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్లకు చేసిన పనుల్లో ఇప్పటి వరకు ఇంకా సగం మేర బిల్లులు రావాల్సి ఉంది. సగంలో నిలిచిపోయిన మార్కెట్‌యార్డుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఏడాదిన్నర కాలంగా మార్కెట్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

వారాంతపు సంతలో రాకపోకలకు ఇబ్బందులు

రెండు మున్సిపాలిటీల్లో నిత్యం ఏదో ఒక కాలనీలో వారాంతపు సంతలు కొనసాగుతున్నాయి. దీంతో ఇటు ప్రజలకు, చిరువ్యాపారస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణాలు పూర్తయితే ఈ సంతలను అక్కడే నిర్వహించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



నాగారం మున్సిపాలిటీలో నిలిచిపోయిన వెజ్, నాన్-వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులను వెంటనే తిరిగి ప్రారంభించాలి. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్ణయం తీసుకోవాలి. కాలనీల్లో ఏర్పాటు చేసే సంతలతో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– కౌకుట్ల చంద్రారెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్

పెండింగ్ పనులు ప్రారంభించాలి



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దమ్మాయిగూడ మున్సిపాలిటీలో వెజ్, నాన్-వెజ్ మార్కెట్ యార్డు అవసరాన్ని అప్పటి అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఏడాదిన్నరగా మార్కెట్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెండింగ్‌లో పనులను ప్రారంభించాలి.

– ప్రణీతాగౌడ్, దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు


కబ్జాదారులు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించిన మున్సిపల్ సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నం. 673/పి బృహత్ పట్టణ ప్రకృతి వనానికి ప్రభుత్వం కేటాయించారు. అయితే కబ్జాదారులు ఆ స్థలంలో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జవహర్‌నగర్ కార్పొరేషన్ మున్సిపల్ టీపీఎస్ స్రవంతి గురువారం సిబ్బందితో కలిసి ఆ స్థలంలో ప్లాట్ల కోసం వేసిన హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పాండు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


యూబీఐలో మహిళా ఉద్యోగులు

ఘట్‌కేసర్: పట్టణంలోని యూనియన్ బ్యాంకు (యూబీఐ)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూబీఐ మేనేజర్ వివేక్‌కుమార్, డీబీఎం క్రిసోలైట్, ఆర్డీఓ త్రిపర్ణ, సుమంత్, సంధ్యారాణి, రవికుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లర్ నం.18, 19 యూటర్న్.. నౌ ఓపెన్



మేడ్చల్: మేడ్చల్‌లో జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు ఎప్పటికప్పుడు తీరుస్తున్నామని మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ అన్నారు. జాతీయ రహదారిపై పిల్లర్ నం.18, 19 మధ్యలో మూసేసిన యూటర్న్‌ను తిరిగి ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వైభవంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు

అల్వాల్: టెంపుల్ అల్వాల్ మహాలక్ష్మి దేవాలయం ఐదవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గురువారం సుప్రభాతసేవ, మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, సెక్రటరీ సూర్యప్రకాష్, సుబ్రహ్మణ్యం, కమిటీ మెంబర్లు తదితరులున్నారు.

ఆర్చరీ కోచ్‌పై చర్యలు తీసుకోవాలి

కీసర: ఆర్చరీ పోటీల్లో తన కుమారుడు పాల్గొనకుండా తప్పుదోవ పట్టించిన ఆర్చరీ కోచ్ గణేష్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటున్న క్రాంతికుమార్, సోనాఘోష్ దంపతుల కుమారుడు నిఖిత్(10) రాంపల్లిలోని రిక్వెల్డ్ ఫోర్డ్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. నిఖిత్‌కు చిన్నతనం నుంచి ఆర్చరీ పట్ల ఆసక్తి ఉంది. దీంతో నిఖిత్ తల్లిదండ్రులు చదువుతో పాటు ఆర్చరీలో శిక్షణ ఇప్పించేందుకు రాంపల్లిలో ఉండే ఇచ్చే కోచ్ గణేష్‌తో శిక్షణ ఇప్పిస్తున్నారు. 33 నెలలుగా ఆర్చరీ క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్న నిఖిత్ అండర్-10 విభాగంలో పలుమార్లు ఆర్చరీ పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు.

◆ ఫిబ్రవరిలో కోచ్ గణేష్ అతడికి సరైన శిక్షణ ఇవ్వడం లేదు. దీంతో నిఖిత్ తండ్రి క్రాంతికుమార్ కోచ్ గణేష్‌ను మందలించాడు. ఈ విషయం మనస్సులో పెట్టుకున్న కోచ్ ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో తమ కుమారుడు నిఖిత్ పాల్గొనకుండా తమను తప్పుదోవ పట్టించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్చరీ హెడ్ కోచ్ డాక్టర్ రవిశంకర్‌కు గురువారం వారు ఫిర్యాదు చేశారు. కోచ్ గణేష్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటునందిస్తా

● ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
● చర్లపల్లిలో సీఐఏ ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో ప్రారంభం


ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలోని పారిశ్రామికవాడలు, పారిశ్రామికవేత్తల ప్రగతికి తోడ్పాటునందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్ (సీఐఏ) ఆధ్వర్యంలో 5వ సీఐఏ ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో -2025ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పరిశ్రమల ఉత్పత్తులకు ప్రచారం, పారిశ్రామికవేత్తల మధ్య పరస్పర సంబంధాలు పెరిగి వ్యాపారాభివృద్ధిని సాధించేందుకు ఎక్స్‌పోలు దోహదపడతాయన్నారు. పరిశ్రమల నిర్వహణకు అవసరమైన ముడిసరుకులు, ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి సౌలభ్యాలకు అనువైన వేదికలన్నారు. పారిశ్రామికవేత్తలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో రోడ్ల నిర్మాణాలకు రూ.150 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తయి నెలరోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సుమారు వేయికి పైగా కంపెనీలు ఉన్న చర్లపల్లి పారిశ్రామికవాడలో కన్వెన్షన్ అవశ్యకత ఉందన్నారు. త్వరలోనే కన్వెన్షన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. పారిశ్రామికవాడల్లో పనిచేసే కార్మికులకు అండగా ఉంటూ విద్య, వైద్యం అందేలా చూస్తానన్నారు. ఎక్స్‌పోలో 106 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ ఉత్పత్తులను ప్రదర్శించారు. మూడ్రోజుల పాటు ఈ ఎక్స్‌పో కొనసాగనున్నట్లు సీఐఏ అధ్యక్షుడు గోవిందరెడ్డి తెలిపారు.

అకారణంగా విద్యార్థినులను చితకబాదిన ఉపాధ్యాయుడు




విద్యార్థినులకు తీవ్ర గాయాలు

కీసర: కీసర ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రతో చితకబాదాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో గేమ్స్ పిరియడ్ ఉండటంతో విద్యార్థినులు తరగతి బయటకు వచ్చారు. మూడు రోజులుగా పాఠశాలకు హాజరుకాని ఉపాధ్యాయురాలితో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన వ్యాయమ ఉపాధ్యాయుడు అక్కడకు వచ్చిన విద్యార్థినులను కర్రతో చితకబాదాడు. ఏడుగురు విద్యార్థినులకు వీపు, చేతులపై గాయాలయ్యాయి. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థినులు పాఠశాలలో జరిగిన విషయాన్ని చెప్పారు. అకారణంగా విద్యార్థినులను కర్రతో చితకబాదిన వ్యాయమ ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

జవహర్‌నగర్: ఆటోడ్రైవర్ అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌లో చింత ప్రవీణ్‌కుమార్(36), భార్య మేఘన, పిల్లలతో కలిసి ఉంటున్నారు. ప్రవీణ్‌కుమార్ గబ్బిలాల్‌పేటలో నివసించే ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. గతంలో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి ప్రవీణ్‌కుమార్‌ని తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. జనవరి 25వ తేదీన ప్రవీణ్‌కుమార్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రవీణ్‌కుమార్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడని భార్య మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హంస వాహన సేవ


మేడ్చల్ దాక్షాయని సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా స్వామివారిని ప్రతిరోజు వాహనంపై పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తున్నారు. బుధవారం రాత్రి భృంగీశ్వరసేవ, గురువారం రాత్రి హంసవాహన సేవ నిర్వహించారు. పల్లకీపై స్వామివారిని ఆలయం నుంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు చేశారు. – మేడ్చల్

13న తైబజార్ వేలం పాట

కీసర: నాగారం మున్సిపాలిటీలో తైబజార్‌కు ఈనెల 13న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ... 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న తైబజార్ వేలంపాట ఈనెల 13న మధ్యాహ్నం 12.30గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభం అవుతుందన్నారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు రూ 2లక్షలు మున్సిపల్ కమిషనర్ నాగారం పేరున డీడీ తీసి ఉదయం 11.30గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు కేటాయించాలి


కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్: మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిని కోరినట్లు ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం ఆయన ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మురుగు నిర్వహణకు రూ.133కోట్లు విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో అధిక నిధులు రప్పిస్తారన్నారు.

8న జాతీయ లోక్‌అదాలత్

కుషాయిగూడ: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 8న కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో జరిగే ఈ జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్ కేసులతో పాటుగా రాజీపడదగిన క్రిమినల్, వాహనప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్, భూవివాదాలు వంటి కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని ఆయన సూచించారు.

సూర్యారామం గ్రంథావిష్కరణ

మల్కాజిగిరి: రామాయణం, భారతం, భాగవతం లాంటి పురాణాలను నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆచార్య డాక్టర్ బేతవోలు రామబ్రహ్మంగారు అన్నారు. ఆనంద్‌బాగ్ లలితాపరమేశ్వరి దేవాలయంలో కృతికర్త (రచయిత) పొన్నెకంటి సూర్యనారాయణ రచించిన సూర్యారామం గ్రంథం ఆవిష్కరణ పొన్నెకంటి అరుణ్‌కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. రామబ్రహ్మం మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణాన్ని నేటితరానికి అర్థమయ్యేలా చిత్రాలతో గ్రంథాన్ని రచించడం హర్షనీయమన్నారు. గ్రంథ విశ్లేషకులు అవధాని సురభి శంకరశర్మ మాట్లాడుతూ.. రెండేళ్లలో ఏడు ఖండాలుగా గ్రంథాన్ని రచించడం అద్భుతమన్నారు. గ్రంథం తొలికాపీని నూతి సాయిబాబుకు అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలం సోమారం గ్రామంలో గురువారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన జరిగింది. ఈ మహోత్సవంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు కరుణాకర్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, జగన్‌రెడ్డి, నాయకులు భాగ్యారెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకట్, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



'పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీకి సహకారం ఉంటుంది'

నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి


కౌకుట్ల చంద్రారెడ్డిని కలిసిన నాగారం ఓల్డ్ విలేజ్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు

కీసర: నాగారం మున్సిపల్ ఓల్డ్ విలేజ్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు, గురువారం మున్సిపల్ మాజీ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కౌకుట్లచంద్రారెడ్డి మాట్లాడుతూ... సమస్యలు వచ్చినప్పుడు క్రైస్తవులందరూ ఏకమై సమష్టిగా ముందుకెళ్లి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని క్రైస్తవుల సంక్షేమానికి ఈ కమిటీని ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. కమిటీకి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ బి. ఇజ్రాయిల్, వైస్ ప్రెసిడెంట్ శాంసన్, జనరల్ సెక్రటరీ కె.రాజేష్, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులు జేమ్స్‌రతన్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు



విజయోత్సవ సంబురాలు

మేడ్చల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో గురువారం మేడ్చల్ నియోజకవర్గంలో కమలదళం సంబురాలు చేసుకుంది. ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శైలజహరినాథ్ ఆధ్వర్యంలో పట్టణంలో వివేకానంద విగ్రహం వద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ఇస్తామని ఇప్పుడు మరచిపోయిందన్నారు. అందుకే కాంగ్రెస్‌ను చీత్కరించుకున్నారని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి బీజేపీ పార్టీని గెలిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్జున్, మైసూర్ రాజు, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..

మేడ్చల్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించడంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, సరస్వతి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు రంజిత్‌మోహన్, కృష్ణగౌడ్, రవిందర్‌గౌడ్, అర్జున్‌బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలో బీజేపీ నాయకుల సంబురాలు